హైదరాబాద్ వార్త







# జూపార్కులోని జంతువులు,పక్షులకు ఎన్‌క్లోజర్లు, ఎయిర్‌కూలర్లు ఏర్పాటు

**చార్మినార్,మార్చి 11 ప్రభాతవార్త :** ఎండలు తీవ్రంగా మండుతుండటంతో హైదరాబాద్ పాతబస్తీ బహ దూర్ పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులోని జంతువు లు,పక్షులు ఎండ వేడిమి నుంచి కాపాడటానికి జూపార్కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.పులులు,సింహాలు,కోతులు ఎన్‌క్లోజర్లు వద్ద దాదాపు యాభై ఎయిర్ కూలర్లు నెలకొల్పారు.గత వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా మండుతున్నాయి.జూపార్కు అధికారులు జూ పార్కులో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఎండ తగల కుండ ఉండేలా ఎయిర్ కూలర్లు,ఎయిర్ ఫ్యాన్లు ఏర్పాట్లు చేశారు.జూపార్కులో 20 పులులు,22 సింహాలు,20 కోతులు ఉన్నాయి.ఈ జంతువులు ఉన్న ఎన్‌క్లోజర్ ఎదురుగా చల్లదనం ఎయిర్ కూలర్లు ఉంచారు.జూ పార్కు సిబ్బంది జంతువులకు మూడు సార్లు చల్లని నీరును పైపులతో సిబ్బంది చల్లుతున్నారు.ఎన్‌క్లోజర్లు వద్ద రెయిన్ గన్స్,పక్షులు ఎన్‌క్లోజర్లు వద్ద ఫగ్గర్స్,పక్షుల ఎన్‌క్లోజర్ల షెల్టర్లు మీద తుంగ గడ్డి కప్పారు. జూపార్కులోని పక్షులు,చిలుకలు,కోతులకు పలు రకాల పండ్లు తినిపిస్తున్నారు.జూపార్కులోని సింహాలు,పులులుతో పాటు పక్షులు, చిలుకలు ఇతర పక్షులకు సైతం గూక్లోన్ -డి, విటామిన్ సి,బి. కాంప్లెక్స్ ట్యాబ్‌లెట్లను నీటిలో కలిపి అందిస్తున్నారు.వేసవి కాలం సందర్భంగా జూపార్కులోని జంతువులు,పక్షులను ఎండ వేడిమి నుంచి కా పాడటానికి అన్ని ఏర్పాట్లు చేశామని జూ పార్కు క్యూరేటర్ జె.వసంత వెల్లడించారు.







# సిటీలో 'సిఎన్‌జి' కొరత!

-బంకుల వద్ద బారులు తీరిన ఆటోలు, కార్లు -ప్రతికిలోకు రూ.10 అధనంగా వసూలు -కొలతల్లోనూ మోసం చేస్తున్న యజమానులు

**హైదరాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** పశ్చిమాసి యా యుద్ధం ప్రభావం హైదరాబాద్ రోడ్లపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్,అమెరికా,ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భీకర పోరు కారణంగా గల్ఫ్ దేశాల నుండి చమురు సప్లై చైన్ దెబ్బతినడంతో.. దేశంలో ఎల్‌పిజి, సిఎన్‌జి కొరత ఏర్పడింది. ముఖ్యంగా అది మెట్రోలో నగరాలపై పడింది. తాజాగా హైదరాబాద్‌లో సీఎన్ జీ స్టేషన్ల వద్ద కిలోమీటర్ల మేర ఆటోలు, క్యాబ్లు బారులు తీరాయి. నగరంలో రోజువారీ సీఎనీ వినియోగం సుమారు 2.1 లక్షల కిలోలుగా ఉంటుంది. అయితే యుద్ధం వల్ల దిగుమతులు తగ్గడంతో సరఫరా దాదాపు 50 శాతానికి పడిపోయింది. నగరవ్యాప్తంగా ఉన్న 70కి పైగా సీఎన్‌జీ స్టేషన్ల వద్ద ఆటోలు, క్యాబ్లు, ఇతర ప్రైవేట్ వాహనాలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. డ్రైవర్లు ఒక్కోసారి 6 నుండి 8 గంటల పాటు క్యూలో ఉంటున్నారు. ఇది వారి దైనందిన సంపాదనపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల ఆటో డ్రైవర్లు గ్యాస్ దొరకక ఆవేదన వ్యక్తం చేస్తుండగా, మరికొన్ని చోట్ల ఆటో సిలిండర్లలో వంట గ్యాస్‌ను నింపుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

### అదనపు ఛార్జీలు వసూలు..

కొరత తీవ్రంగా ఉందంటూ వినియోయోగదారుల జేబులు లూటీ చేస్తున్నారు. ఒక కిలో సీఎన్జీపైన రూ.10అదనంగా దండుకుంటున్నారు. దీంతో ఆటోవాలాలే తీవ్రంగా నష్టపోతున్నారు. అక్రమ వసూళ్లపై నిలదీసే వినియోగదారులకు కొరత ఉంది..స్టాక్ లేదంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో వినియోగదారులు తప్పనిసరిగా అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోంది. గ్రేటర్‌లో సుమారు 70కిపైగా కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) బంకులు ఉన్నాయి. ఒక్కోబంకు ద్వారా 6వేల కిలోల వరకు విక్రయించే సామర్థ్యం ఉంది. కానీ డిమాండ్‌కు తగినంత అదుబాటులో లేకపోవడంతో 3వేల నుంచి 4వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో కిలో సీఎన్జీ రూ.92.61 చొప్పున లభిస్తోంది. కానీ బంకుల నిర్వాహకులు దీనికి మరో రూ.10అదనంగా వసూలు చేస్తున్నారు. నగరంలోని నాగోల్, లక్డీకపూల్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మియాపూర్,అల్వాల్, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లో సీఎన్‌జీ బంకుల్లో అదనపు వసూళ్ల పర్వం కొనసాగుతుందని పలువురు ఆటోవాలాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లో ప్రస్తుతం 1.40లక్షల ఆటో రిక్షాలు ఉన్నాయి. వీటిలో 80వేలకు పైగా సీఎన్‌జీపైనే ఆధారపడి తిరుగుతున్నాయి. మరోవైపు సుమారు 2లక్షలకు పైగా కార్లు సీఎన్‌జీ వినియోగిస్తున్నాయి. డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేకపోవడం వల్ల బంకుల వద్ద రాత్రిం బవళ్లు రద్దీ కనిపిస్తుంది. బంకుల నిర్వాహకులకు ఈడిమండ్ఒక అవకాశంగా మారింది. బదీంతో అక్రమార్జనకు తెరలేపారు. సాధారణంగా ఒక ఆటో సిఎన్జీకిట్‌కు 4కిలోల సామర్థ్యం మాత్రమే ఉంటుంది. సిఎన్‌జీ నింపుకునన ప్రతిసారి రూ.40చొప్పున అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఆటోడ్రైవర్లు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకకార్లలోని ట్యాంకర్ల సామర్థ్యం 10కిలోలవరకు ఉంటుంది. కానీ 8కిలోలే నింపుతారు.



బేగంపేట్‌లోని ఓపెట్రోల్‌బంక్‌వద్ద సిఎన్‌జి గ్యాస్ కొరకు బారులు తీరిన ఆటోలు

### కొలతల్లోనూ మోసాలు..

మరోవైపు సీఎన్‌జి కొలతల్లోనూ మోసాలు ఉన్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఒకకిలో సిఎన్‌జీ కొనుగోలు చేస్తే 850గ్రాములవరకే లభిస్తుందని పేర్కొంటున్నారు. ఆటోడ్రైవర్లు 4కిలోల సిఎన్‌జీని కొనుగోలు చేస్తే 300గ్రాములకుపైగా తడగ్గిస్తున్నారు. సాధారణంగా పెట్రోల్,డీజీల్ బంకుల్లో తూకాల్లో మోసాలు ఉన్నట్లుగానే సిఎన్‌జీ బంకుల్లోనూ మోసాలు ఉన్నట్లు ఆటో సంఘాలు ఆందోళన చేస్తున్నాయి.

# ఐటి కారిడార్ హాస్టళ్లకు గ్యాస్ కష్టాలు

-ప్రైవేటు హాస్టళ్ల ఫుడ్ మెనూలో కోతలు
-టీ,కాఫీలు,ఆయిల్ టిఫిన్లు బంద్
- భోజనంలో కూరలు సైతం పరిమితమే..

**గచ్చిబౌలి, మార్చి 11 ప్రభాతవార్త**

పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్ నగరంపై ప్రభావం చూపిస్తుంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరతతో ఐటి కారిడార్‌కు గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. ఐటి కారిడార్‌లో ఉద్యోగాలు చేస్తున్న లక్షలాది మంది ప్రైవేటు హాస్టళ్లలో నివాసం ఉంటుండగా, గ్యాస్ కొరత కారణంగా ప్రైవేటు హాస్టళ్ల ఫుడ్ మెనూలో కోతలు విధిస్తున్నాయి. ప్రైవేటు హాస్టళ్లలో ఉండే వారికి రోజు ఉదయం, సాయంత్రం అందించే టీ, కాఫీలను బందు చేయడంతో పాటు ఆయిల్‌లో వేయించే టిఫిన్లను9 సైతం నిలిపివేస్తున్నట్లు హాస్టళ్ల ముందు బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు భోజనంలో సైతం అన్నం, పప్పు వంటి పరిమిత ఆహారం మాత్రమే అందజేస్తామని ప్రకటించారు. మరో రెండు రోజుల్లో గ్యాస్ సరఫరా మెరుగుపడకపోతే ప్రైవేటు హాస్టళ్లలో కిచెన్‌లు మొత్తం బంద్ చేయడమేనని నిర్వాహకులు వాపోతున్నారు. గ్యాస్ సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందుల కారణంగా ఐటి కారిడార్ పరిధిలోని ప్రైవేటు హాస్టళ్లలో నివాసం ఉంటున్న లక్షలాది మంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఫుడ్ మెనూలో కోతలపై అన్ని హాస్టళ్ల ముందు బోర్డులు ఏర్పాటు చేయగా, బుధవారం గచ్చిబౌలి ప్రశాంతిహిల్స్ లో ఐటి కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ ఇబ్బందులను వెల్లడించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్- ఇరాక్ యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరా నిలిచిపోయిందన్నారు. గత వారం రోజులుగా గ్యాస్ సరఫరా 80శాతం పడిపోయిందని, రోజుకు 100 సిలిండర్లు అవసరం అయ్యే చోట 20 సిలిండర్లు మాత్రమే అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు

దీంతో పాటు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ ప్రారంభమయ్యిందని, 2,110 రూపాయలు ఉన్న సిలిండర్‌ను బ్లాక్‌లో 3వేల నుంచి 3500 రూపాయలకు విక్రయిస్తున్నారని వాపోయారు. నగరంలో దాదాపు 11వేల హాస్టళ్లు ఉన్నాయిని, వీటిలో సుమారు 10 లక్షల మంది నివాసం ఉంటున్నారన్నారు. గ్యాస్ కొరత కారణంగా హాస్టళ్లలో నివాసం ఉండే వారికి పూర్తి స్థాయిలో ఆహారం అందించలేకపోతున్నామని వాపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టళ్ల నిర్వాహకులతో చర్చించిన అనంతరం అసోసియేషన్ పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.

### ఫుడ్ మెనూలో కోతలు...

కమర్షియల్ సిలిండర్ల కొరత కారణంగా ఐటి కారిడార్ పరిధిలోని ప్రైవేటు హాస్టళ్లలో ఫుడ్ మెనూలో కోతలు పెడుతున్నట్లు ప్రకటించారు. ఈమేరకు అన్ని హాస్టళ్ల ముందు ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. రోజు ఉదయం, సాయంత్రం ఇచ్చే టీ, కాఫీలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు ఎక్కువ గ్యాస్ వినియోగం అయ్యే ఆయిల్ టిఫిన్లు దోశ, పూరి, ఛపాతీ, వడ వంటి టిఫిన్లను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మద్యాహ్నం, రాత్రి అందించే భోజనంలో అన్నం, పప్పు వంటి సాదారణ మెనూను అందజేస్తామన్నారు. మరో రెండు రోజుల్లో హాస్టళ్లలో ఉన్న గ్యాస్ నిల్వలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని, ఇదే జరిగితే కిచెన్‌లను మొత్తం బంద్ చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు హాస్టళ్లకు ఇచ్చే సిలిండర్లను కమర్షియల్ విభాగం నుంచి గృహఅవసర విభాగంలోకి మార్చాలని కోరారు. ప్రభుత్వాలు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లతో మాట్లాడి హాస్టళ్లకు నిరంతర గ్యాస్ సరఫరా జరిగే విధంగా చూడాలని అన్నారు. ఇప్పటికే పలు నగరాల్లో హోటళ్లు, హాస్టళ్ల కిచెన్‌లు మూసివేశారని, హైదరాబాద్ నగరంలో సైతం అటువంటి పరిస్థితులు రాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు తాతా కరుణాకర్, మహిధర్, జయరామ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మధు, సూర్య కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### కట్టెల కోసం పరుగులు...

కాగా ఐటి కారిడార్‌కు ఆనుకొని ఉన్న గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, అంజయ్యనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులు గ్యాస్ కొరతను అధిగమించేందుకు కట్టెల కోసం పరుగులు పెడుతున్నారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిగా నిలిచిపోతే అత్యవసరం కోసం కట్టెల పొయ్యి మీద వంటలు చేసేందుకు హాస్టల్ నిర్వాహకులు కట్టెలను సిద్దం చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు హాస్టళ్ల నిర్వాహకులు కట్టెలను కొనుగోలు చేసి పెట్టుకోగా, పలువురు కట్టెల కోసం టింబర్ డిపోల చుట్టూ తిరుగుతున్నారు.

# హెచ్‌సిటీ పనుల భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

-యజమానులు టిడిఆర్‌లకు ఒప్పుకునే విధంగా చర్చించాలి -అధికారులకు సిఎంసి కమిషనర్ సృజన ఆదేశం

**హైదరాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్‌సిటీ పనులకు భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన ప్రాజెక్ట్,టౌన్‌ప్లానింగ్, ఎల్‌ఏవో అధికారులకు ఆదేశించారు. ఈమేరకు బుధవారం సిఎంసి ప్రధాన కార్యాలయం భవనంలో హెచ్‌సిటీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు,ఎల్‌ఏవోలకు భూస్వాధీనం ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రాజెక్ట్ ఇంజినీర్లకు ఐఐఐటి జంక్షన్,ఖాజాగూడ జంక్షన్ వద్ద డిఎల్‌ఎఫ్- బిహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్ పనులను మార్చి 2027 నాటికి పూర్తి చేసే విధంగా షెడ్యూల్ సిద్ధం చేయాలని సూచించారు.అలాగే జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు టౌన్ ప్లానింగ్ విభాగంతో సమన్వయం చేసుకుని ప్రభావిత ఆస్తులను ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ విభాగానికి ఈనెల 31 నాటికి అప్పజెప్పాలని, అలాగే భూస్వాములతో చర్చించి టిడిఆర్‌లకు అంగీకరించేలా ప్రయత్నించాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం పనుల పురోగతిని వేగవంతం చేసి, నిర్ణయించిన కఠినమైన గడువులను పాటిస్తూ పనులను పూర్తి చేయాలనిఆదేశించారు. అలాగే పనుల కార్యకలాపాలు, గడువు, పురోగతిని వివరించే పిఈఆర్‌టి చార్టర్లను సమర్పించి, ఒప్పుకున్న సమయపట్టికను కచ్చితంగా పాటించాలని జోనల్ కమిషనర్లు వివిధ పనులకు ఇచ్చిన పరిపాలనా అనుమతులను సమీక్షించాలని సూచించారు.నేటి నుండి ఆరు నెలల ముందు ఇచ్చిన అనుమతులపై ఆపనులు నిజంగా అవసరమా, ఆ పనులు చేయగలమా, అనే విషయాలపై తగిన వివరణలను సమర్పించాలన్నారు. అలాగే సరస్సుల్లో ఉన్న నీటి ముల్లు మొక్కలు పూర్తిగా తొలగించాలని, జూన్ నాటికి ఏ సరస్సులోనూ అవి ఉండకూడదని సూచించారు. అదేవిధంగా శ్మశానవాటికల అభివృద్ధి పనులు, పార్కులు, వీధి దీపాలు, ఫుట్‌పాత్‌ల శుభ్రత వంటి ప్రణాళికాబద్ధ పనులను చేపట్టాలని కమిషనర్ తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడానికి జోనల్ కమిషనర్లు డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.ఏదైనా చట్టపరమైన కూల్చివేతలు చేపట్టే ముందు కమిషనర్‌కి సమాచారం ఇవ్వాలని, అవసరమైన పోలీస్ రక్షణను కూడా పొందాలని సూచించారు.



హెచ్‌సిటీ పనుల మ్యాప్‌లను పరిశీలిస్తున్న సిఎంసి కమిషనర్ సృజన తదితరులు

### చింతల్, కుత్బుల్లాపూర్‌లలో సి.ఎం.సి కమిషనర్ ఆకస్మిక పర్యటన

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన చింతల్ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటికీ వెళ్లి స్వచ్ఛ వాహనాల ద్వారాడోర్ టు డోర్ చెత్త సేకరణ జరుగుతున్న విధానంపై స్థానికులతోమాట్లాడారు.అలాగే వాహనాల హాజరు విచారించి, డ్రైవర్లు ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణకు హాజరు కాకపోతే ఆ వాహనాలను సీజ్ చేసి వేరొక డ్రైవర్‌కి బాధ్యత ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా వీధిని పరిశీలించి ప్రతి వాణిజ్య సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ట్విన్ బిన్స్ తప్పనిసరిగా పెట్టుకోవాలని కఠినంగా ఆదేశించారు. విధులు సక్రమంగా నిర్వహించని సంబంధిత ఎస్‌ఎఫ్‌ఏలను తీవ్రంగా హెచ్చరించారు.



సుధీర్ సంఘీకి శ్రద్ధాంజలి ఘటించిన కుటుంబ సభ్యులు, బంధువులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి11:** ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధీర్ సంఘీ ఈనెల 8వ తేదీన పరమపదించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డె న్ టెంపుల్‌లో ఆయన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా భక్తి పాటలతో కూడిన భజన కార్యక్రమం జరిగింది. దీనికి ప్రముఖ పారిశ్రామిక వేత్త రవి సంఘీ, వార్త సిఎండి,మాజీ ఎంపీ డాక్టర్ గిరిష్‌కుమార్ సంఘీ, కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. స్వర్గీయ సుధీర్ సంఘీకి శ్రద్దాంజలి ఘటించారు.

## ఆపరేషన్ సింధూర్ అనుభవంతో డేటా అధారిత యుద్ధ విధానాలపై దృష్టి

- చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



సిడిఎంలో ప్రసంగిస్తున్న ఉపేంద్ర ద్వివేది

**అల్వాల్, మార్చి 11 ప్రభాతవార్త:** సాంకేతిక సామర్థ్యం, సంస్థాగత చురుకుదనం, స్వావలంబన అనే మూడు ప్రధాన అంశాలుపై భారత సైన్యం కొత్త దశలోకి ప్రవేశిస్తోందని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని ఆర్మీ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కాళాశాలను చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ సందర్శించారు. 21వ హైయ్యర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య ఉపన్యాసం ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా నేర్చుకున్న పాఠాలను ప్రస్తావిస్తూ దేశం ప్రతి స్పందనాత్మకమైన ధోరణి నుంచి ముందస్తు నిరోధక ధోరణి వైపు మారిందన్నారు. మల్టీడోమేన్ ఆపరేషన్‌లు, డేటా అధారిత యుద్ధ విధానాలు మరియు మానవ రహిత వ్యవస్థలను వినియోగించాల్సి న అవసరాన్ని గుర్తు చేశారు. కమాండింగ్ ఆఫీసర్ నుంచి సైన్యాధిపతి వరకు గ్రే జోన్ యుద్ధంపై అవగాహన అవసరమని స్పష్టం చేశారు. దేశంలో లభ్యం అయ్యే మానవ వనరులను సమర్ధవంతంగా వినియోగించు కోవాలని సూచించారు. భైరవ్ బెటాలియన్, స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్సెస్ బ్రిగేడ్ వంటి విభాగాలు ఏర్పాటు ద్వారా ఆధునిక భద్రతా సవ్వాను సైన్యం ఎదుర్కొందన్నారు. త్రివిధ దళాలలో సమన్వయాన్ని పెంపొందించడంలో కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కళాశాల విశిష్ట సేవలను అందిస్తోందని కొనియాడారు. వికసిత్ భారత్ 2047 అనే జాతీయ దృష్టి కోణంతో అనుసంధానమై సైన్యం పని చేస్తుందని తెలిపారు.

## హైటెన్షన్ రోడ్డు పనులు పరిశీలించిన కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి

**అల్వాల్, మార్చి 11 ప్రభాతవార్త:** మల్కాజిగిరి జోనల్ కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి బుధవారం అల్వాల్‌లో పర్యటించారు. 99 రోజులు యాక్షన్ ప్లాన్‌లో బాగంగా హై టెన్షన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్డు పనులను తనిఖీ చేశారు. 2 కిలో మీటర్లు మేరకు జరుగుతున్న పనులులో వేగం పెంచాలని మే చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. రహదారి ఆక్రమణలను తక్షణం తొలగించాలని ఆయన స్పష్టం చేయడంతో పాటుగా నాణ్యతలో రాజీ ఉండరాదన్నారు. అనంతరం గంగపుత్ర కాలనీలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ భవనం పనులను పరిశీలించారు. ఏప్రిల్ చివరి నాటికి పనులు పూర్తి అవుతాయని ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది కమీషనర్‌కు వివరించారు. శానిటరీ సూపర్ వైజర్లు ఇ తర సిబ్బందితో కమీషనర్ సమావేశం అయ్యారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను తడి పొడిగా మాత్రమే సేకరించాలని స్పష్టంగా పేర్కొన్నారు. పారిశుధ్యం పనులుపై ఎటువంటి ఫిర్యాదులకు తావు ఉండరాదని తెలిపారు.



సిసి రోడ్డును పరిశీలిస్తున్న కమీషనర్

# రెండు దశల్లో జనగణన

-మొదట ఇండ్లు ..ఆతర్వాత జనభా లెక్కలు
-రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హోళికేరి
జనగణనలో ఒక్క హౌస్ హోల్డ్ మిస్ కావొద్దు
-జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

**హైదరాబాద్, మార్చి 11,ప్రభాతవార్త:** జనాభా గణన-2027ను గ్రేటర్ వ్యాప్తంగా పకడ్బందీగా చేపట్టి ఏఒక్కరినీ వదలకుండా, డూప్లికేషన్ లేకుండా చూడాలని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హోళికేరి అన్నారు. క్షేత్రస్థాయిలో జనాభా ఉన్నది ఉన్నట్టు రిఫ్లెక్ట్ కావాలన్నారు. క్వాలిటీ డేటా వల్ల అభివృద్ధి ప్రణాళికలు, పాలసీల రూపకల్పనకు, ప్రజాస్వామ్యం బలోపేతానికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. ఈమేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లోజీహెచ్‌ఎంసీ పరిధిలో నీసెన్సెస్ సర్వేపై ఛార్జీసెన్సెస్ ఆఫీసర్‌లు, అదనపు ఛార్జీ సెన్సెస్ ఆఫీసర్‌లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే రెండు దశల్లో జరుగుతుందని మొదటి దశలో ఇళ్ల జాబితా సేకరణ, గృహ గణన, రెండో దశలో జనాభా గణన ఉంటుందన్నారు. మొదటి దశ పగడ్బందీగా నిర్వహిస్తే రెండో విడత సజావుగాజరు గుతుందన్నారు.ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు, పాలసీ ల రూపకల్పనలోక్వాలిటీ సెన్సెస్ డేటా ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అంతటి ప్రాముఖ్యత గల సెన్సస్ కార్యక్రమాన్ని ఖచ్చితత్వంతో గుణాత్మకంగా నిర్వహించాలన్నా రు. ఇందుకోసం సెన్సెస్ పై ఛార్జ్ సెన్సెస్ ఆఫీస ర్‌లు, అదనపు ఛార్జ్ సెన్సెస్ ఆఫీసర్‌లకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. అప్పుడే టీమ్ కు సర్వే సరిగ్గా జరిగేలా మార్గదర్శనం చేయగలు గుతారని చెప్పారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, క్షేత్ర సిబ్బందికి గైడ్ చేయగలుగుతారన్నారు. సర్వేలో సాంకేతికకు ప్రాధాన్యమిస్తున్న దృష్ట్యా డిజిటల్ టూల్స్ పై అధికారులు ఫోకస్ పెట్టాలన్నారు. స్పష్టతతో సర్వే చేపట్టేందుకు వీలుగా ప్రాక్టికల్ ట్రైనింగ్ కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సెన్సెస్ ను సీరియస్‌గా తీసుకుని టీమ్ వర్క్ గా పనిచేస్తూ తెలంగాణ అవతరించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి సెన్సెస్‌ను విజయవంతం చేసి మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపాలని సూచించారు. జిజిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, జిహెచ్‌ఎంసి పరిధిలో చేపట్టనున్న జనగణనలో కుటుంబాల వాస్తవ స్థితిగతులను ప్రతిబింబిచాలన్నారు.తమ పరిధిలోని ఎన్యూమరేషన్ బ్లాక్‌లో ఒక్క హౌస్ హోల్డ్ కూడా మిస్ కావద్దని నాణ్యమైన సమగ్ర డేటాను సేకరించాలన్నారు. మొదటి దశ హౌస్ లిస్టింగ్, హౌసింగ్ లెక్కలు (హెచ్‌ఎల్‌వో) లో భాగంగా ఇంటి పరిస్థితులు, ఇంట్లోని సౌకర్యాలకు సంబంధించిన సమాచార సేకరణ జరుగుతుంది. రెండో దశలో దేశంలోని ప్రతి వ్యక్తికి సంబంధించి ఎజనాభా, సామాజిక, ఆర్థిక వివరాలు నమోదు పక్కగా చేయిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జి హెచ్‌ఎంసి అదనపు కమిషనర్ చంద్రకళ, మాస్టర్ ట్రైనర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భారతి హోలికేరి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

## ఆంధ్ర ఎంపిల వైఖరిని ఖండిస్తున్నాం

**-తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిల్లును పార్లమెంటులో ఆమోదించిన రోజు అయిన ఫిబ్రవరి 18వ రోజును బ్లాక్‌డేగా అభివర్ణిస్తూ ఆంధ్ర పెంపీలు లావు కృష్ణదేవరాయలు, తెన్నెటి కృష్ణప్రసాద్‌ల వైఖరిని తెలంగాణ ఉద్యమకారులుగా, న్యాయవాదులుగా ఖండిస్తున్నామని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆనాటి ఏపీ నేతల కుట్రల వల్లనే తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది యువకులు బలిదానాలు చేసుకున్నారని గుర్తు చేశారు. కేంద్రం నుంచి ప్రత్యేక హోదా సాధించుకోలేని అసమర్థులు, వారి చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవటానికి తెలంగాణపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో సమైక్యంగా సహజీవనం చేస్తున్న తెలుగు ప్రజలే మీ వ్యాఖ్యలను అసహ్యించుకుంటున్నారని, మీకు రోషం, ఆత్మాభిమానం ఉంటే తెలంగాణలో ఆవాసం చేయకూడదని సవాల్ విసిరారు.

### మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : ఎమ్మెల్యే శ్రీగణేష్



ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫాను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మార్చి 11 ప్రభాతవార్త:** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ ప్రతీక రంజాన్ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం తాడ్‌బంద్ చౌరస్తాలోని మజీద్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు అందజేస్తున్న రంజాన్ తోఫాను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డుమాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, ముస్లిం మైనార్టీ నేతలు అబీద్, కరన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

### పేదలు సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే తలసాని



మెరుగైన వైద్యానికి ఎల్.ఓ.సిని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాద్ తదితరులు

**అడ్డగుట్ట,మార్చి 11 ప్రభాతవార్త:** కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి అర్హులైన లబ్ధిదారులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం ఎస్. ఆర్.టీకి హేమలతకు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు సిఎం.ఆర్.ఎఫ్.నుంచి మంజూరైన 3.50 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని బుధవారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, హేమలత, సుభాష్, మురళీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దానంను కలిసిన విశాల్ సుధాం



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంను సత్కరిస్తున్న విశాల్ సుధాం.

**బేగంపేట మార్చి 11,ప్రభాతవార్త**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత పిటిషన్లను తెలంగాణా శాసన సభ స్పీకర్ తోసి పుచ్చిన తర్వాత బంజారా హిల్స్‌లోని దానం నాగేందర్ ఇంటివద్ద ఆయన్ను పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్తకర్తలు కల్సి అభినందనలు తెలియజేసారు. బేగంపేట కు చెందిన కాంగ్రెస్ నాయకులు విశాల్‌సుధాం దానం నాగేందర్ ను కల్సి కండువ కప్పి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా విశాల్ సుధాం మాట్లాడుతూ దానం నాగేందర్ నిత్యం ప్రజలలో ఉండే వాడని ఆయనకు ప్రజాభిమానం మెండుగా ఉందని, అన్నారు.

## మొబైల్స్ వాడకంతో భవిష్యత్‌ను కోల్పోతున్నారు

**-ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు డా.జానారెడ్డి**



స్క్రీన్ టైమ్ టు గ్రౌండ్ టైమ్ అనే కార్యక్రమంలో పాల్గొన్న జానారెడ్డి, డిఐ శ్రీనివాస్, ఎస్సై షఫీ విజేతలు.

**బేగంపేట మార్చి 11,ప్రభాతవార్త**

నేటి తరం యువత ఎక్కువగా మొబైల్ వాడకం లో పడి తమ భవిష్యత్ ను అంధకారం చేసుకుంటున్నారని, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జానారెడ్డి అన్నారు. అందువల్ల యువత స్క్రీన్ టైమ్ ను తగ్గించి గ్రౌండ్ టైమ్, యాక్టివిటీ టైమ్‌ను పెంచుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన బేగంపేట డిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు నేడు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, ఫిజికల్ యాక్టివిటీస్ పాల్గొనడం తగ్గించారన్నారు. ఎక్కువగా క్రీడల్లో పాల్గొని గ్రౌండ్ టైమ్ ను పెంచుకోవాలని సూచించారు. స్క్రీన్ టైమ్ టు గ్రౌండ్ టైమ్ కాన్సెప్ట్‌తో క్రీడోత్సవ్ ఖేలో భారత క్రీడలు నిర్వహించారు. బుధవారం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. విజేతలకు బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో మహానగర్ వైస్ ప్రశిడెంట్ నరేందర్‌రెడ్డి, ఎస్సై షఫీ, ఎస్ఎఫ్‌డి మహానగర్ కన్వీనర్ పాండురంగ్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గౌతమ్, కాలేజ్ ప్రశిడెంట్ అభినయ్, వైస్ ప్రశిడెంట్ గణేష్, కాలేజ్ సెక్రటరీ పుండ్లిక్, కాలేజ్ గర్ల్స్ కన్వీనర్ ఐశ్వర్య, ఎస్ఎఫ్‌డి కన్వీనర్ రవి, శ్రీకాంత్, విజయ్, కిషోర్, రామ్‌చరణ్, కుమార్, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముస్లిం కుటుంబాలకు దుస్తులు పంపిణీ

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 11, ప్రభాతవార్త :** రంజాన్ మాసం పర్వదినంను పురస్కరించుకుని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీలో బట్టల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ పాల్గొని ముస్లిం కుటుంబాలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనల తో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరి సోదర మణులకు పండుగను ధనిక, పేద అనే బేధం లేకుండా సుఖసంతోషాలతో జరుపుకునేందుకు వీలుగా ముఖ్య



బట్టలు పంపిణీ చేస్తున్న గాంధీ

మంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో బట్టల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్ రావు, ఎండి ఇబ్రహీమ్, దామోదర్ రెడ్డి, లింగయ్యా, రాదబాయి కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## తయారు చేసిన పట్టు వస్త్రాలు సమర్పించడం అభినందనీయం : ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, మార్చి 11, ప్రభాతవార్త:**

భద్రాద్రి శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా స్వామి వారికి మగ్గంపై పోచంపల్లి పట్టు వస్త్రాలు తయారు చేసి సమర్పించడం అభినందనీయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 27 వ తేదీన భద్రాచలం లో జరిగే సీతారాముల కళ్యాణం, 28 వ తేదీన నిర్వహించే పట్టాభిషేకం సందర్భంగా అలంకరించే పోచంపల్లి పట్టు వస్త్రాల తయారీకి ఉపయోగించే పట్టు ధారాలు (పోగులు)ను అమీర్‌పేట లోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజల అనంతరం మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా మగ్గంపై వస్త్రాలు తయారు చేసే అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులకు అందజేశారు. ఈ పొగులతో భద్రాచలం రాముల వారి ఆలయం ప్రాంగణంలో వస్త్రాలను ఈ నెల 13 వ తేదీ నుండి తయారు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అంబుజ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, కమిటీ చైర్మన్ జయరాజ్, కార్యదర్శి రాజేశ్వరరావు, పద్మశాలి సంఘం నాయకులు భద్రయ్య,



కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న తలసాని

శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, వనం శ్రీనివాస్, కూతురు నర్సింహ, గుడిగే శ్రీనివాస్ యాదవ్, కట్టా బలరాం, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కుంభాభిషేకం పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని**

అమీర్‌పేటలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో కుంభాభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై పూజలలో పాల్గొన్నారు. అనంతరం విద్యా శంకర భారతి మహాస్వామి ఆధ్యాత్మిక బోధనలను ఎంతో భక్తి శ్రద్ధలతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాద వ్ ఆలకించారు. ఈ సందర్భంగా విద్యా శంకర భారతి స్వామి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదించారు.

## మహిళలకు గౌరవం ఇంటి నుంచే రావాలి : ప్రియాంక వర్గీస్

**జూబ్లీహిల్స్, మార్చి 11, ప్రభాతవార్త ః**

విద్య, కనీస వనరులు కల్పించడం వల్ల మహిళలు చదువుతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించడానికి అవకాశాలు కల్పించినట్లవుతుందని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డైరక్టర్, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ అన్నారు. విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా గివ్ టు గైన్ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలకు గౌరవం అనేది మొదటగా తన ఇంటి నుంచే దక్కాలని అప్పుడే వారిలో మనో నిబ్బరం పెంపొందుతుందని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి, ఎంచుకున్న వృత్తిలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం చెప్పినట్లు మాహిళా విద్యార్థులు కలలు పెద్దగా కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి ప్రణాళికా ప్రకారం కష్టపడాలని దీంతో విజయాన్ని సులువుగా అందుకోవచ్చన్నారు. మహిళా విద్యార్థులు ఆర్థిక స్వావలంబన సాధించాలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ఘంటా చక్రపాణి ఆకాంక్షించారు. ఈ విద్య సంవత్సరం నుండి వి హబ్‌తో కలిసి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రియాంక వర్గీస్.

వి ఎనేబుల్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరక్టర్ ఆచార్య ఘంటా పుష్పచక్రపాణి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. యల్. విజయ కృష్ణా రెడ్డి, విశ్వవిద్యాలయ మహిళా అభివృద్ధి, విస్తరణ కేంద్రం ఇంచార్జ్, ప్రొ.కె.రాణి రజిత మాధురి, ప్రొ ఇ. సుధారాణి, ప్రొ.పల్లవి కాబడే, ప్రొ. కె. శ్రీదేవి, ప్రొ.ఎన్.రజని, ప్రొ.మేరీ సునంద, డా. ఉదయిని, రుషీంద్ర మణి, సరిత, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, పలు విభాగాల డైరెక్టర్స్, డీన్స్, అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గున్నారు.

## పొగాకు రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**ముషీరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పొగాకు రహిత సమాజ నిర్మాణంలో మీడియాతో సహా అందరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం కవాడిగూడలోని పత్రికా సమాచార కార్యాలయంలో ధూమపానం వల్ల కలిగే నష్టాలు, నో స్మోకింగ్ డే ప్రాముఖ్యత, ధూమపానంలో మీడియా పాత్ర వంటి అంశాలపై మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ మాట్లాడుతూ ధూమపానం, పొగాకు వినియోగం వల్ల క్షయ సహా అనేక వ్యాధుల ముప్పు పెరుగుతుందని, శరీరంలోని కీలక అవయవాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. క్షయ వ్యాధికి పొగాకు వినియోగం ఆజ్యం పోస్తోందని, క్షయ బాధితుల్లో 8 శాతం మంది పొగాకు అలవాటు ఉన్నట్లు గణాంకాలు చెప్తున్నాయని గుర్తు చేశారు. పొగాకు వ్యసనాన్ని మానుకోవాలనుకునే వారు నేషనల్ టొబాకో క్విట్‌లైన్ సర్వీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1800112356 కు ఫోన్ చేసి, సలహాలు పొందవచ్చునని సూచించారు. ఎన్‌టిఈపీ ఐఈసీ అధికారి ఎస్.జితేంద్ర మాట్లాడుతూ ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం సమాజా



నోస్మోకింగ్ డే వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న వక్తలు

నికే నష్టమని అన్నారు. పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ ..ధూమపానం వంటి వ్యసనాలను నివారించటానికి ప్రజా భాగస్వామ్యం కీలకమని, ఇందుకోసం అవగాహన కల్పించటానికి మీడియా కృషి చేయాలని కోరారు. ఈ కార్యనరకమంలో పీఐబీ హైదరాబాద్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, పొగాకు నిర్మూలన స్వచ్ఛంధ కార్యకర్త, టొబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్, మీడియా ప్రతినిధులు, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనం ఓటు హక్కు మాత్రమే : కెటిఆర్

**మెహిదీపట్నం, మార్చి 11, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని మార్చగలిగే శక్తివంతమైన సాధనం ఓటు హక్కు మాత్రమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ అమలౌతుండడంతోనే ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. దేశంలో విద్యావంతులు, మేధావులు రాజకీయాల్లోకి వస్తేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యావంతులు, మేధావులు లేని రాజకీయాలను ఊహించలేమని, వారు రాజకీయాల్లోకి వస్తేనే రాజకీయ ప్రక్షాళన జరుగుతుందన్నారు. మ



యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినిలకు మెమొంటోలను అందజేస్తున్న కేటీఆర్.

హిళా శక్తి ఎంతో గొప్పదని, ముఖ్యంగా మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు రాజకీయాల్లోకి రావాలని కోరారు. కళాశాల ఆధ్వర్యంలో యూత్ పార్లమెంటు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన న్యూస్ బులిటెన్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం పోటీల్లో గెలిచిన విద్యార్థినీలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు

**జూబ్లీహిల్స్, మార్చి 11, ప్రభాతవార్తః**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ నెల 13, 14 తేదీల్లో 'స్థిరమైన అభివృద్ధి కోసం వ్యాపార పరివర్తన' పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పలు అంశాలపై టెక్నికల్ సెషన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ముగింపు సమావేశానికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య సుదర్శన్ కుంట్లూరు ముఖ్యఅతిధిగా విచ్చేస్తారన్నారు. పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులతోపాటు పలువురు హాజరవుతారన్నారు. సమావేశంలో దేశవ్యాప్తంగా కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు, పరిశోధకులు నుంచి 182 పరిశోధనా పత్రాలు అందాయని, దేశవ్యాప్తంగా సుమారు 250 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

## విద్య వినయం మానవత ప్రతిభకు సార్ధక్యం



ప్రతిభా వికాస పురస్కారాల స్వీకర్తలైన విద్యార్థులతో హనుమంతరావు, అశ్వినిసుబ్బారావు, రవీంద్ర, కృపాకర్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, మార్చి 11 ప్రభాతవార్త :** విద్యతోపాటు వినయం, మానవత్వం, దేశ సామాజిక సేవాతత్పరత ప్రతిభకు సార్ధక్యం కలిగిస్తాయని వక్తలన్నారు. భారత్ వికాస పరిషత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభా వికాస పురస్కార ప్రదానోత్సవంలో వివేకానంద సేవాసమితి చైర్మన్ సిహెచ్.హనుమంతరావు, అశ్విని సుబ్బారావు, వందేమాతరం ట్రస్టు కార్యదర్శి రవీంద్ర, సత్యమేవజయతే ట్రస్టు కార్యదర్శి కృపాకర్, మాజీ కార్పొరేటర్ మహేంద్ర, సాధన నరసింహాచార్య, తిరుపతిరెడ్డి, లవకుమార్‌గౌడ్, ధనదుర్గ, నవిత తదితరులు అతిథులుగా పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి మాట్లాడారు. సభకు అశ్వినీ సుబ్బారావు అధ్యక్షత వహించగా సిహెచ్.హనుమంతరావు సభను ప్రారంభించారు. అనంతరం అతిథులు నగరంలోని 14 పాఠశాలల నుండి ఎంపిక చేసిన ప్రతిభావంతులైన విద్యార్థులను వివేకానందస్వామి సాహిత్యం, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ప్రతిభా వికాస పురస్కారాలు ప్రదానంచేసి శుభాశీస్సులందజేశారు. మున్ముందు కూడా విద్య, సేవాతత్పరలలో ప్రతిభను కనబరుస్తూ గొప్ప భావిభారత పౌరులుగా ఎదిగి మంచి పేరుప్రఖ్యాతులు సాధించాలని సూచించారు.

## హనుమాన్‌నగర్‌కు ఇంద్రన్న కుటుంబం అండ : సబితాఇంద్రారెడ్డి

**-పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదు : కార్తిక్ రెడ్డి**

**అత్తాపూర్ మార్చి 11, ప్రభాతవార్త :** హనుమాన్ నగర్ ప్రజల జోలికి వస్తే కోరుకునే ప్రసక్తే లేదని హనుమంతుడు లాగా ధైర్యంగా ఐక్యంగా ప్రజలు ఉండి ప్రభుత్వంపై పోరాటం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ మండలం హనుమాన్ నగర్ బస్తివాసులకు అండగా భరోసా కల్పిస్తూ ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ మంత్రి సబితా ఇంద్రరెడ్డి ,కార్తిక్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడారు...15 ఏళ్ల తర్వాత మళ్లీ హనుమాన్ నగర్ ప్రజల కోసం ఇంద్రా రెడ్డి మీకోసం పంపించినట్లు అనిపిస్తుందని అప్పుడు నేను ఇచ్చిన ఆర్డర్ ను ఇంతవరకు ఎవరు టచ్ చేయలేదని నాలుగేళ్ల కిందట వస్తే కెసిఆర్‌తో చర్చించి మీకు న్యాయం చేస్తుండే అని అన్నారు. ఇప్పటికైనా ఏం కాదని మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హనుమాన్ నగర్ భూముల ను లాక్కొన్ని వేలం వేసి అమ్ముకొని సొము చేసుకోవాలని ప్రభుత్వం చూస్తుందని మీకు పట్టాలు ఇచ్చే విధంగా సీఎంకు లెటర్ రాస్తానని మీ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని భరోసా కల్పించారు. సీఎం రేవంత్ రెడ్డి కి రంగారెడ్డి జిల్లా మీద కన్ను పడిందని ఎక్కడ చూసిన భూముల అమ్ముకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. హనుమాన్ నగర్ కు ఇంద్రన్న కుటుంబం అండగా ఉంటుందన్నారు. అంతక ముందు రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాజేంద్రనగర్‌కు శని దాపరించిందని సిఎంకు పేదల గుడిసెలు ఎక్కడ ఉన్నాయి వాళ్ళని ఎట్లా పంపించాలి ఇదే ధ్యాస తప్ప



మరొకటి లేదని కార్తీక్ రెడ్డి మండిపడ్డారు. 50ఏళ్లుగా ఉంటున్నా బస్తీవాసులకు డబుల్ బెడ్ రూంలు ఇస్తా వెళ్లండి అంటే వారి భవిష్యత్తు ఎం అయిపోవాలని ప్రశ్నించారు. హనుమాన్ నగర్ పేదలకు ఆపద వస్తే స్థానిక ఎమ్మెల్యే అండగా ఉండాలి కానీ సీఎం రేవంత్ రెడ్డి తో జతకలసి దోపిడికి పాల్పడుతున్నారని రాబోయే రోజుల్లో రాజకీయంగా కర్మ ఫలం అనుభవించడం తప్పదన్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు కానీ ప్రభుత్వం చెప్పిందని హనుమాన్ నగర్ మీదకు వస్తే ప్రతి ఒక్కరిని గుర్తుపెట్టుకుంటామని రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మాజీ కార్పోరేటర్ అర్చన జయప్రకాష్ ,బిఆర్ఎస్ మాజీ కోఆప్షన్ సభ్యులు కొలను సుభాష్ రెడ్డి , మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు కుమార్, కాలనీవాసులు నారాయణ స్వామి, డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్, నోముల రాము యాదవ్, రాజేష్ యాదవ్, యాదయ్య, కొంపల్లి జగదీష్ నేత, తిరుపతి రెడ్డి, సూర్యం, మైసిరెడ్డి, భూదేవి, అరుణ, ఏర్వసరితా మహేష్ నేత, నాగేష్, విజయ్, ప్రవీణ్, మహేష్ రెడ్డి, గంజి రాజు నేత, సునీల్, పాల్గొన్నారు.

## మాల సామాజికవర్గం అన్ని రంగాలలో రాణించాలి : చెన్నయ్య

**సైఫాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** మాల సామాజిక వర్గానికి చెందిన యువత అన్ని రంగాలలో రాణించడానికి కృషి చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ప్రపంచం రోజురోజుకు ఎంతో అభివృద్ధి చెందుతున్నదని, ఈ అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకుని, అట్టడుగు వర్గాలకు కూడా అందించాలని ఆయన సూచించారు. బుధవారం నాడిక్కడ మాల మహానాడు యువజన విభాగం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా పసుపులేటి పవన్ ను నియమించి, నియామక పత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత మేరకు వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని, కాని అవి అమలులో జాప్యం జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. మాల యువత అన్ని విభాగాల్లో రాణించడమే ధ్యేయంగా పెట్టుకోవాలని, యువతను ప్రోత్సహిస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం



పసుపులేటి పవన్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న జి.చెన్నయ్య

ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాల యువతలో చైతన్యం తీసుకువస్తే సమాజం బలోపేతానికి కొంత మేరకు సాయం చేసినవారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.మంద రంజీత్‌కుమార్, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.సుధాకర్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ జి.రమేష్, బాలకృష్ణ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యానికి సిఎంఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలి



సి.ఎం.ఆర్.ఎఫ్.చెక్కును అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 11 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 1వ వార్డు సంజీవయ్య నగర్ ప్రాంతానికి చెందిన పసుపుల ప్రసన్న కుమారికి మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.20 వేల చెక్కును మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోటా మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని బుధవారం జక్కుల మహేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్తర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టులకు హెల్త్ కార్డుల పథకం వర్తింపచేయాలి



ఆరోగ్యశాఖమంత్రి దామోదరం రాజనరసింహకు వినతిపత్రం అందచేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

**ముషీరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్‌కార్డుల పథకాన్ని జర్నలిస్టులకు కూడా వర్తింపచేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఆరోగ్యశాఖమంత్రి దామోదరం రాజనరసింహను కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయటం లేదని, ప్రైవేట్ ఆసుపత్రులలో బిల్లులు పెండింగ్ పేర వైద్య చికిత్స అందించటం లేదని అన్నారు. నిమ్స్‌లో కూడా ఉచితంగా పూర్తి చికిత్స అందటం లేదని, దీనివల్ల చాలీ చాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న జర్నలిస్టులు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి, వైద్య చేయించుకోలేక, ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రభుత్వం అమలుచేయబోతున్న తెలంగాణ ఎంప్లాయీస్ హెల్త్ కేర్ పథకంను జర్నలిస్టులకు కూడా వర్తింపచేయాలని, జర్నలిస్టుల తరఫున కంట్రిబ్యూషన్ ప్రభుత్వమే చెల్లించాలని విజ్ఞప్తి చేశా రు. రిటైరైన జర్నలిస్టులను కూడా ఈ పథకంలోకి చేర్చాలని కోరారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య, యాక్టింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంచందర్, కార్యదర్శులు చంద్రశేఖర్, రాజశేఖర్, గుడిగ రఘు పాల్గొన్నారు.

### చేనేతకారులకు ప్రోత్సాహం అందించాలి

**- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన**



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సైబరాబాద్ కమిషనర్ సృజన.

**జూబ్లీహిల్స్, మార్చి 11, ప్రభాతవార్తః**

చేనేతకారులకు ప్రోత్సాహమందించేందుకు వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం అభినందనీయమని సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ జి. సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను బుధవారం ఆమె ప్రారంభించారు. చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేత వస్త్రాతలను ప్రతి ఒక్కరూ ధరించాలని, ఉగాది, రంజాన్ పండుగలకు అనుగుణంగా ప్రదర్శనలో ఏర్పాటుచేసిన వస్త్రోత్పత్తులు కొలువుదీరాయన్నారు. దేశంలోని ప్రముక నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. దాదాపు 70 ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటుచేసి వీటిని ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. గద్వాల్, వెంకటగిరి, ఇక్కత్, పటోల్, బెనారస్, కోల్‌కత్తా, చందేరి, మదనపల్లి, పోచంపల్లి తదితర రకాల చీరలను ప్రదర్శనలో ఏర్పాటుచేశారు. ఈ నెల 17 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు.

### ఎస్సి, ఎస్టిల నిధుల కేటాయింపులపై చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.శంకర్

**సైఫాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** వచ్చే బడ్జెట్ సమావేశాల్లో దళిత, గిరిజనులకు (ఎసీ, ఎస్టీ) బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై అసెంబ్లీలో చర్చించాలని, విద్యకు 20 శాతం నిధుల కేటాయించాలని పలు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, విద్య పరిరక్షణ కమిటి వైస్-చైర్మన్ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, బిఎంఐ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.సర్వయ్య, నాయకులు సుధీర్, కల్పన సంజీవ్, దాసరి ఏగోండ స్వామి తదితరులు మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితులకే కాకుండా చేవెళ్ళలో విడుదల చేసిన డిక్లరేషన్‌ను అములు చేయాలని, అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించాలని, స్వయం ఉపాధి పథకాలను అమలు చేయాలని, ఎస్సీల జనాభా ప్రకారం రిజర్వేషన్‌లు శాతాన్ని 18కు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని వారు కోరారు. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రభుత్వం ఖర్చు చేయలేదని, వాటిని కూడా కలిపి ఖర్చు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పోక్సోకేసులో నేరస్తుడికి 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష

**అల్వాల్, మార్చి 11 ప్రభాతవార్త:** అత్యాచారం పోక్సో కేసులో నేరస్థుడికి 20 ఏళ్ళు కఠిన కారాగార శిక్షను ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు విధించింది. మల్కాజిగిరి కమీష్నరేట్ పరిధిలోని అల్వాల్ పోలీసు స్టేషన్‌లో 2024లో జరిగిన అత్యాచారం కేసులో ఆర్.జి.నారాయణను నిందితుడిగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ అప్పట్లో విచారణ అధికారిగా ఉన్నారు. విచారణ వేగవంతంగా ముగించిన పోలీసు బృందాలు నివేదికను న్యాయ స్థానం ముందు ఉంచారు. న్యాయమూర్తి పరిశీలన పూర్తి చేసిన నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ బుధవారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి వెంకటేష్, నారాయణను నేరస్థుడిగా నిర్ధారిస్తూ తీర్పును వెల్లడించారు. నేరస్థుడికి 20 ఏళ్ళు జైలుతో పాటుగా 10వేలు జరిమాన, బాధితురాలికి 2లక్షలు పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ప్రభాకర్ రెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. అల్వాల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కేసును పర్యవేక్షించడం జరిగింది.

### కూకట్‌పల్లిలో స్పా ముసుగులో వ్యభిచారం

**-నిర్వాహకులతో సహా యువతుల అరెస్టు**



అదుపులోకి తీసుకున్న యువతులు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 11, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని చామ్ వెల్నెస్ స్పా సెంటర్‌పై కూకట్‌పల్లి పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. స్పా పేరుతో కొనసాగుతున్న వ్యభిచార దందాకు సంబంధించిన ముఠాను పట్టుకున్నారు. సెంటర్ నిర్వహిస్తున్న నిర్వాహకులైన దివ్య, సంగీత, జయప్రకాష్‌లతో పాటు మరో ఆరుగురు యువతులను ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సెల్ ఫోన్లు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించే స్పా సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కూకట్‌పల్లి సిఐ సుబ్బారావు హెచ్చరించారు.

### వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : విజయభాస్కర్ రెడ్డి



ఎపిఎయు కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, చిత్రంలో కాలనీ అధ్యక్షుడు మాడిగెల విజయభాస్కర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, మార్చి 11, ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏయు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. అస్మాన్ ఘాడ్ డివిజన్ ఏపీఏయు కాలనీ లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

### మలక్ పేటలో కళ్యాణ మండపాన్ని నిర్మించాలి

**-ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావు**


డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న శ్యామ్ రావు, గోపాల్ ,నందు తదితరులు

**మలక్ పేట ,మార్చి 11, ప్రభాతవార్త:** మలక్ పేట సర్కిల్ పరిధిలో కళ్యాణ మండపం నిర్మించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాం రావు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి బి. గోపాల్ లు పేర్కొన్నారు. ఈ మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం నాయకుల బృందంతో కలిసి వారు మలక్ పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలక్ పేటలో సుమారు రెండు వేల చదరపు గజాల స్థలాన్ని కేటాయించి, ఆదునాధనా సౌకర్యాలతో కళ్యాణ మండపం నిర్మించాలని కోరారు. కళ్యాణ మండపాన్ని నిర్మించడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కళ్యాణ మండపాన్ని నిర్మించాలని కోరుతూ ఆర్ అండ్ బి అధికారులకు కూడా లేఖ రాయడం జరిగిందని డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందు, శ్రీనివాస్, నర్సింగ్ రావు, వెంకట్ స్వామి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

### డిఅర్‌డీసి కేంద్రంలో వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

**హుడాకాంప్లెక్స్,11 మార్చి, ప్రభాతవార్త :** సరూర్‌నగర్ డివిజన్ లోని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం(డిడిఆర్‌సి) రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో బుధవారం వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే, అంతర్జాతీయ మహిళా దినోత్సము ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా నోడల్ అధికారి పి.రమేష్ స్వాగత ఉపన్యాసం అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి టి.ఎల్.సంగీత మాట్లాడుతూ వికలాంగ పిల్లల అభివృద్దిని ఎప్పటికపుడు తల్లిదండ్రులు డిడిఅర్‌సి సిబ్బంధికి తెలియజేయ వలసిందిగా పేర్కొన్నారు. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని డిఅర్‌ఒ, డిడిఅర్‌సి సిబ్బంధిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ మండల తహసిల్దార్ ఎస్.వేణుగోపాల్, డిడిఅర్‌సి సిబ్బంధి పి.సుస్మిత, ఎస్.మల్లికార్జీ, కె.జయశ్రీ, ఎ.ధనలక్ష్మీ, పి.సజిత, వికలాంగ పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక : జితేందర్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**సైదాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** రంజాన్ పండుగ మత సామరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంతరం జితేందర్ మాట్లాడుతూ రంజాన్‌మాసం సహనం, ధాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి వాజిద్, ప్రధాన కార్యదర్శి బండి సురేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### సాయికృష్ణానగర్ కాలనీలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన


సాయికృష్ణాకాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, మార్చి 11 ప్రభాతవార్త :** రామంతాపూర్ సాయికృష్ణ నగర్‌లో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుని వచ్చారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దశలవారిగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సాయికృష్ణాకాలనీలో నిర్మిస్తున్న కొత్త కల్వర్టును ఎమ్మెల్యే పరిశీలించారు. నాలా పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎం.డి.జహంగీర్, గంధం నాగేశ్వరరావు, డాక్టర్ బి.వి.చారి, సంతోష్, కాలేరు జైనవీన్, పాయసం గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, సూరం శంకర్, కాలనీ అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళాసాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యం

**-రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి**


మహిళా పోలీసులను సన్మానిస్తున్న కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

**సైదాబాద్, మార్చి 11 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని గౌడ సంఘంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీసులను, జిహెచ్‌ఎంసి మహిళా కార్మికులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాసాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే సమాజం ముందడుగు వేస్తుందన్నారు. మహిళలు విద్య, ఉపాధి రంగాల్లో ముందంజ వేయాలన్నారు. స్త్రీ శక్తి సమాజానికి బలం అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. మహిళల్లో ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేసి 140కి పైగా స్టాల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గత రెండున్నరేళ్లలో డ్రాక్రా మహిళలకు దాదాపు రూ.23వేల కోట్ల వడ్డీలేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మి ప్రసన్న, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, నాయకులు తులసి శ్రీనివాస్, బబ్బూరి ఆనంద్ గౌడ్, బేర బాలకిషన్, కోటగిరి శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్‌రెడ్డి, గణేష్ నాయక్, వసంత పాల్గొన్నారు.

## ప్రతి రంగంలో మహిళల పాత్ర అమూల్యం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి




**నేరేడ్‌మెట్, మార్చి 11,ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని నేరేడ్‌మెట్ డివిజన్ జె.జె.నగర్ మహాబోధి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు జే.కే. సాయి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన సతీమణి మమతా రాజశేఖర్ రెడ్డితో కలిసి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి దాదాపు 500 మంది మహిళలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. కార్యేషు దాసి, కరుణేషు మంత్రి, భోజేషు మాత” అనే సుభాషితాన్ని ఉదహరిస్తూ మహిళల గొప్పతనాన్ని కొనియాడారు. తన జీవితంలో ఇద్దరు మహిళలు ఎంతో ప్రభావం చూపారని, అందులో ఒకరు తన తల్లి అరుంధతి, మరొకరు తన సతీమణి మమతా రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు.ఝాన్సీ లక్ష్మీబాయి, మదర్ తెరిసా, సావిత్రిబాయి పూలే, ఇందిరా గాంధీ వంటి మహనీయ మహిళలను స్మరించుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, పారిశుద్య కార్మికులు, డాక్టర్లు, టీచర్లు తదితరులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రావుల అంజయ్య, జేపీసీ వెంకన్న, జీ.కే. హనుమంత్ రావు, మధుసూదన్ రెడ్డి, చిందం శ్రీనివాస్, మేకల రాము యాదవ్, ప్రభాకర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, మోహన్, ఉస్మాన్, పేపర్ శీను, వంశీ, రాజశేఖర్ రెడ్డి, బాలకృష్ణ, రాజు, సంపత్ యాదవ్, రాజేష్ గౌడ్, నవీన్ రాజ్, అవినాష్, గంగాధర్, కుమార్, హనుమాన్ చారి, నర్సింగ్ రావు, గౌస్ ఇమ్రాన్, శివసాయి యాదవ్, బాలరాజు, రవీందర్, జనార్దన్, హేమంత్, వినీత్, బేబక్క, శోభ, ప్రమీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే అసెంబ్లీ ముట్టడి


వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న జిల్లా అధ్యక్షులు ఇరగదిండ్ల తిరుపతి తదితరులు

**ఉప్పల్, మార్చి 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరగదిండ్ల తిరుపతి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వడ్డెర కుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇరగదిండ్ల తిరుపతి మీడియాతో మాట్లాడుతూ వడ్డెర కులాన్ని బిసి జాబితా నుండి తొలగించి ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ జర్చర్ల బహిరంగసభలో ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి ఎంపిగా ఉన్న సమయంలో వడ్డెర కులాన్ని ఎస్టీ చేర్చాలని కెసిఆర్‌కు లేఖ రాశారని తెలిపారు..2018లో మెదక్ జిల్లా ముత్తంగి వడ్డెర సంఘం బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వడ్డెర కులాన్ని ఎస్టీలో చేర్చుతామని, అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపిస్తానని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని తెలిపారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కూడా ప్రకటనలు చేశారని, మేనిఫెస్టోలో కూడా పొందుపర్చారని, స్వరాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వడ్డెర్లను ఏనాడు పట్టించుకోలేదని. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు దీని గురించి మరిచిపోయారని గుర్తు చేశారు.వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలలో వడ్డెర్ల కార్పొరేషన్ బిల్లు పెట్టాలని, లేకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆలకుంట సుధాకర్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కస్తూరి సత్యం, స్థానిక మండలాల వడ్డెర నాయకులు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో సుందరీకరణ జరిగిన చెరువులపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

**-మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**


గత బిఆర్ఎస్ పాలనలో సుందరీకరణతో ఎంత చక్కగా ఉందో తన సెల్‌ఫోన్‌లో వాకర్స్‌కు చూపిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 11 ప్రభాతవార్త:** కెసిఆర్ సారథ్యంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సుందరీకరణ చేసిన చెరువులు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిర్వహణ లేక నిర్లక్ష్యానికి గురువుతున్నాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులను తీర్చిదిద్దుతున్నామని చెబుతున్న ప్రభుత్వం గత బిఆర్ఎస్ పాలనలో సుందరీకరణ జరిగిన చెరువులను, అసంపూర్తి దశలో ఉన్న వాటిని విస్మరించడం శోచనీయమని విమర్శించారు. నియోజకవర్గంలోని జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చిన జిల్లెలగూడ చందన చెరువు దుస్థితిని మాజీ మంత్రి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అధికారుల నిర్లక్ష్యానికి గురై పూర్తిగా గుర్రపు డెక్క నిండి దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్రంగా ఉన్న చెరువును చూపి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడి వాకర్స్‌ను కలిసి గతంలో ఎలా ఉన్న చెరువు ఎట్లయ్యింది? అంటూ వారితో మాట్లాడారు. కోట్లాది రూపాయల ఖర్చుతో అన్ని విధాల అభివృద్ధి చేసిన చెరువును నిర్వహించడం కూడా చేతగాని స్థితిలో అధికారులు ఉన్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్రపు తొలగించకపోవడం.. ఓపెన్ జిమ్ పరికరాలు పాడవుతుండడం. చిల్డ్రన్స్ పార్కును పట్టించుకోకపోవడం. సానిటేషన్ అధ్వాన్నంగా ఉండడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం పూట ఆహ్లాదం కోసం వచ్చే సందర్శకులు, ఆరోగ్యం కోసం వచ్చే వాకర్స్‌కు దోమల బెడద తీవ్రంగా ఉన్నా కనీసం బడంగ్‌పేట్ సర్కిల్ తరపున ఫాగింగ్ కూడా చేయరా? అంటూ ఆమె అధికారులను ప్రశ్నించారు. చందన చెరువులాగే బిఆర్ఎస్ ప్రభుత్వంలో సుందరీకరణ చేసిన చెరువుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో దారుణంగా తయారైందని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అన్ని చెరువులను సుందరీకరణ చేసి సక్రమంగా నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. చెరువుల వద్ద టాయిలెట్ల నిర్మాణం, పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. శంషాబాద్ జోనల్ కమీషనర్ తక్షణమే చర్యలు తీసుకొని చెరువుల సుందరీకరణ.. నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని సబితా ఇంద్రారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్‌కు చెందిన అధికారులతో పాటు బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో నిధుల గోల్‌మాల్‌పై విజిలెన్స్ విచారణ చేయాలి : బిజెపి


పాఠశాల అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై ఆందోళన చేస్తున్న బిజెపి నాయకులు

**సరూర్‌నగర్, మార్చి 11 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన నిధుల దుర్వినియోగం, అక్రమాలపై విద్యాశాఖాధికారులు, విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణంలో రూ.40 లక్షల నిధుల గోల్‌మాల్‌పై శంషాబాద్ జోనల్ కమీషనర్, బడంగ్‌పేట్ సర్కిల్ డిసి, ఇతర అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం పాఠశాలలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు నడికుడ యాదగిరి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, రావుల మల్లేష్ సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు కళ్లెం లక్ష్మారెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి తదితరులు పాఠశాలలో బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పిఎం శ్రీ నిధులు, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. టాయిలెట్ల నిర్మాణం కోసం మంజూరైన రూ.40 లక్షల నిధులను, అభివృద్ధి కోసం కేటాయించబడ్డ పిఎం శ్రీ నిధులు రూ.10 లక్షలను ఎలాంటి పనులు చేపట్టకుండా దుర్వినియోగం చేశారని వారు వెల్లడించారు. నిధుల వినియోగంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామానుజరెడ్డి పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వారు విమర్శించారు. పాఠశాలలో జరిగిన అక్రమాలపై జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్‌ల దృష్టికి తెచ్చినా వారు చర్యలు తీసుకోకపోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పనులు చేయకుండా బిల్లులు స్వాహా చేసిన వైనంపై విద్యాశాఖాధికారులు, విజిలెన్స్ అధికారులు విచారణ చేసి నిగ్గు తేల్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహిళామోర్చా నాయకురాలు పద్మజ, కావ్య, అరుణ, నాయకులు మోతీలాల్ నాయక్, రేసు నర్సింహారెడ్డి, జగదీశ్వరరాజు, కళ్లెం మురళీధర్‌రెడ్డి, రామాచారి, క్యారగారి అరవింద్, తీగల సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, అంతేర్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపి వేం నరేందర్‌రెడ్డికి ఉప్పల్ నేతల సత్కారం


ఎంపి వేం నరేందర్‌రెడ్డిని కలిసి సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి ఇతర నేతలు

**ఉప్పల్, మార్చి 11 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని బుధవారం ఉప్పల్ డివిజన్‌కు చెందిన పలువురు పార్టీ నేతలు కలిసి సత్కరించారు. మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నేతలు బిక్కుమళ్ల అంజయ్య గుప్తా, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, బజారు జగన్నాదజ్ గౌడ్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, తుమ్మల దేవి రెడ్డి, డిల్లీ చంద్ర శేఖర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ నేత వేం నరేందర్ రెడ్డి ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడంతో ఆయనను పలువురు కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి తగు గుర్తింపు ఇస్తున్నారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి వేం నరేందర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

### ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

**ఎల్.బి.నగర్, మార్చి 11 ప్రభాతవార్త:** మహిళా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తపేట న్యూమారుతినగర్ మహిళా భవనంలో మహిళా దినోత్సవ వేడుకలను శ్రీలక్ష్మి మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళల స్వయం అభివృద్ధి కార్యక్రమాల గురించిన విషయాల పట్ల ఎస్బిఐ బ్యాంక్ ప్రతినిధి వెంకటరాముడు మహిళలకు అవగాహన కల్పించడంతోపాటు పలు సలహాలు, సూచనలు అందజేశారు. మహిళలు అని రంగాలలో అభ్యున్నతి సాధించాలని సూచించారు. నీటి వినియోగం, నీటి ప్రాముఖ్యత గురించి రాణీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తంబోలా, తెలుగులో మాత్రమే నిరగడంగా మాట్లాడడం, ఆట, పాటలతో మహిళలు సందడి చేశారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు మలబార్ గోల్డ్ షాప్ నిరాహాకులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు కామాక్షి, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి వాణి, కార్య వర్గ సభ్యులు విజయ, కృష్ణవేణి, సుకన్య నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు హాజరయ్యారు.

### కాలనీల అభివృద్ధికి నిధుల కోసం సిఎం దృష్టికి తీసుకెళ్తా

**మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్**


కెఎల్ఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నాదర్‌గుల్ డివిజన్ నేత నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 11 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లో మౌళిక సదుపాయాలు లేక వెనుకబడిన కాలనీల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు చేసే నిమిత్తం అవసరమయ్యే నిధుల కోసం సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నాదర్‌గుల్ డివిజన్-57 ముఖ్య నేత నవారు మల్లారెడ్డి బుధవారం అల్మాస్‌గూడ విశాఖనగర్ సౌత్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యవర్గంతో కెఎల్ఆర్‌ను కలిసారు. ఈ సందర్భంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ, అంతర్గత రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరుతూ ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన కెఎల్ఆర్ మాట్లాడుతూ కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పన. అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం అవసరమయ్యే నిధుల కోసం శంషాబాద్ జోనల్ కమీషనర్‌తో మాట్లాడి అంచనాలు తయారు చేయిస్తానని తెలిపారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి కోట్లాది రూపాయల నిధుల మంజూరు కోసం సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఇక్కడి ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చూస్తానని కెఎల్ఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, శివ, ప్రసాద్, చారి, పవన్, రాజేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినా ప్రారంభం కాని పనులు

**ఆందోళన వ్యక్తం చేసిన మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్**


మంత్రి పొన్నం వేసిన శిలాఫలకం ధ్వంసం అయిన వైనాన్ని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్

**సరూర్‌నగర్, మార్చి 11 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ మీర్‌పేట్ డివిజన్ కిందకు వచ్చిన జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగి సంవత్సరం అయినా నేటికి పనులు ప్రారంభించకపోవడంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు, స్థానిక మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మంత్రి వేసిన శిలాఫలకాన్ని పరిశీలించి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలకు సంబంధించి అభివృద్ధి పనుల టెండర్ ప్రక్రియ పూర్తి అయినా పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. అత్యవసరమైన అభివృద్ధి పనులు జరగకపోవడంతో పాఠశాల ప్రతిష్టకు భంగం కలుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి వేసిన శిలాఫలకం సైతం శిథిలావస్థకు చేరుకున్నదని ఆయన విచారం వ్యక్తం చేశారు. అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. లేని పక్షంలో కెఎల్ఆర్ ద్వారా మంత్రి దృష్టికి తీసుకుపోతానని ఆయన స్పష్టం చేశారు.

### చిరువ్యాపారులతో విద్యార్థులకు ఇబ్బందులు

**- ఉపాధ్యాయురాలు వరలక్ష్మి**



**తుర్కయంజాల్ మార్చి11, ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో రాగన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల సాగర్ హైవే రోడ్డు ముందు స్కూలుకు ఆనుకొని చిరు వ్యాపారులు షాపులు పెట్టి అక్కడ చదువుకునే విద్యార్థులకు చాలా ఇబ్బందులు పెడుతున్నారని రాగన్నగూడ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...... సాగర్ హైవే రోడ్డుకు ఆనుకొని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల ఉండడం వల్ల ప్రతిరోజు విద్యార్థులు ప్రమాద బారిన పడవలసి వస్తుందని అక్కడ ఉన్న టీచర్స్ మరియు తల్లిదండ్రులు విద్యార్థులు స్కూల్ నుండి ఇంటికి వచ్చేవరకు భయపడిపోతున్నారు. ఆ యొక్క వ్యాపారుల వల్ల స్కూల్ విద్యార్థులు రోడ్డు పక్క దారిన వెళ్లామంటే స్కూలుకు ఆనుకొని ఉన్న చిరువ్యాపారుల దగ్గరకు కార్లు బైకులు రాంగ్ రూట్లో రావడం వల్ల విద్యార్థులు అక్కడ ఎప్పుడు ఏ వాహనం స్పీడ్ వస్తదో తెలియదు. రోడ్డు పక్కన ఏ రకమైన షాపులు ఉండాకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని తీపిస్తే అక్కడ పిల్లలు రోడ్డు పక్క దారి వెళ్లే స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. లేనియెడల విద్యార్థులు ఆ యొక్క వ్యాపారస్తులు రోడ్డుపై ఉన్నందు వలన పిల్లలకు ప్రాణాలు పోయే అవకాశం ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్/రెవెన్యూ డివిజనల్ అధికారి కి ఫిర్యాదు చేస్తామని వారు తెలియజేశారు.కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ రాగన్నగూడ, ఉపాధ్యాయులు టీచర్స్ పాల్గొన్నారు,

## రూ.28లక్షలతో రాఘవేంద్రకాలనీలో సిసి రోడ్లు : ఎమ్మెల్యే


రాఘవేంద్రనగర్‌కాలనీలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, మార్చి 11 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్ప గడ్డ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.28 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు దశలవారిగా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి, జగన్, నారాయణరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కాలనీ సంఘం నేతలు మోహన్ రెడ్డి, ప్రొ.రాములు, అజయ్, ముకుంద రావు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు

**-హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**అత్తాపూర్ మార్చి11, ప్రభాతవార్త :** అత్తాపూర్ డివిజన్ పరిధిలోని చిన్న అనంతగిరి శివాలయం ముందు భాగంలో ఉన్న ప్రభుత్వ భూమి 354/1 సర్వే నంబర్ లో ఎకరన్నర విలువైన భూమిని కొందరు మతం ముసుగులో కబ్జా చేస్తున్నారని రెండు రోజులుగా స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డిఓ ఎంఆర్ఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఈ విషయంలో అధికారులు సరైన దిశలో కఠినమై న చర్యలు తీసుకోవడం లేదంటూ ఆరోపిస్తూ అత్తాపూర్ హైదర్గూడా ఉప్పరపల్లి ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో శివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కొందరు కోర్టు ఆర్డర్ తమకు అనుకూలంగా ఉందన్న ముసుగులో ఎలాంటి ఆధారం లేకుండా కబ్జా చేస్తున్న ఎందుకు అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ స్థానికులు ప్రశ్నించారు. ఈ ధర్నా ఉధృతకు దారి తీయడంతో పోలీసు లు పెద్ద ఎత్తున మోహరించి పరిస్థితి ని అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగి సంఘటన స్థలానికి వచ్చారు. వాస్తవానికి 354/1 సర్వే నంబర్ లో భూమి కి సంబంధించిన వివాద విషయాన్నీ పరిశీలించి కలెక్టర్ విచక్షణాధికారం మేరకు నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఒక సూచన ఇచ్చింది. ఈ ఆర్డర్ ఇచ్చి నెలన్నర రోజులు కాకముందే కొందరు సిక్కు మతస్తులు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందంటూ ఈ విధంగా కబ్జా చేస్తున్నారో స్థానికులు రంగనాథుకు వివరించారు. అదే సమయంలో గురుద్వారా ప్రబంధక్ కమిటీ చెందిన కొంతమంది సభ్యులతో రంగనాథ్ మాట్లాడి విషయం తెలుసుకున్నారు. సదరు భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నదని కబ్జాలు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని రంగనాథ హెచ్చరించారు.

### పదివ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**చార్మినార్,మార్చి 11 ప్రభాతవార్త :** పదో తరగతి పరీక్షలకు చార్మినార్ జోన్‌లో అన్ని ఏర్పాట్లు చేశామని చార్మినార్ జోన్ ఉప విద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు.మార్చి నెల 14 నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు పదివ తరగతి పరీక్షలు జరగనున్నాయి.ఈ నేపథ్యంలోనే చార్మినార్ జోన్ ఉప విద్యాధికారి కె.శ్రావణ్ కుమార్ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు సరిపడ్డ బెంచీలు,బల్లలు ఏర్పాటు చేశామని, అదే విధంగా మంచి నీరు వసతి కూడకల్పిస్తున్నామని,విద్యార్థులు ఆందోళన పడకుండ ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన కోరారు.చార్మినార్‌జోన్ పరిధిలో ఈ సంవత్సరం 16 ప్రభుత్వ,ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలకు చెందిన 2825 మంది విద్యార్థులు పదివ తరగతి పరీక్షలు రాయనున్నారని,ఇందులో బాలురు 1252 మంది,బాలికలు 1573 మంది ఉన్నారని ఆయన తెలియజేశారు.చార్మినార్ జోన్ పరిధిలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1734 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని,22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు.జోన్‌పరిధిలో ప్రభుత్వ,ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 4559 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు.